క్లుప్తంగా

సైక్లింగ్‌తో ఆరోగ్యం



సైకిల్ ర్యాలీలో పాల్గొన్న ఏపీఎస్పీ బెటాలియన్ పోలీసులు, అధికారులు, సిబ్బంది

డెంకాడ: సైకిల్ తొక్కడం వలన ఆరోగ్యంగా ఉండడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు పాటుపడిన వారమవుతామని చింతలవలస ఐదో ఏపీఎస్పీ బెటాలియన్ అదనపు కమాండెంట్ సి. రాజారెడ్డి అన్నారు. కమాండెంట్ సీహెచ్‌వీఎస్ పద్మనాభరాజు ఆదేశాల మేరకు ఫిట్ ఇండియా కార్యక్రమంలో భాగంగా బెటాలియన్ పోలీసులు సండే ఆన్ సైకిల్ కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కమాండెంట్ రాజారెడ్డి మాట్లాడుతూ.. ఫిట్ ఇండియా కార్యక్రమం ద్వారా ప్రజల్లో ఆరోగ్యస్ఫూర్తిని, యువతలో క్రీడా స్ఫూర్తిని నింపాలన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్‌లు డీవీ రమణమూర్తి, ఎం.గోపాలకృష్ణ, ఆర్ఐలు, ఆర్ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

అన్నదానం



అన్నదానంలో పాల్గొన్న భక్తులు

పూసపాటిరేగ: మండలంలోని జీఆర్ పాలెంలో దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఎస్సై దుర్గాప్రసాద్ ప్రారంభించారు. వందలాది మంది భక్తులు పాల్గొని ప్రసాదం స్వీకరించారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు కూనిశెట్టి గోవిందరావు, జలపార శివ, శాంతాటి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీని కలిసిన ట్రైబల్ రైట్స్ ఫోరం ప్రతినిధులు



ఎస్పీకి పుస్తకం అందిస్తున్న ట్రైబల్ రైట్స్ ఫోరం సభ్యులు

విజయనగరం క్రైమ్: ఇటీవల ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన ఏఆర్ దామోదర్‌ను ట్రైబల్ రైట్స్ ఫోరం సభ్యులు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గిరిజన విద్యార్థుల సమస్యలు, స్కిల్ డవలప్‌మెంట్‌పై చర్చించారు. ఎస్పీని కలిసిన వారిలో ఫోరం సభ్యులు నరసం దొర, రాయలు ధనుంజయ, జోడు నాగరాజు, ఆర్ఎస్ వరహాల దొర ఉన్నారు.

గ్రంథాలయంలో సాహిత్య సదస్సు



వక్త డాక్టర్ జక్కు రామకృష్ణను సత్కరిస్తున్న విజయభావన సాహితీ సమాఖ్య ప్రతినిధులు

విజయనగరం టౌన్: గురజాడ జిల్లా కేంద్ర గ్రంథాలయంలో విజయభావన సాహిత్య సదస్సు ఆదివారం నిర్వహించారు. డాక్టర్ ఎ.గోపాలరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ జక్కు రామకృష్ణ ప్రసంగిస్తూ ఆదికవి నన్నయ్య కవితా వైభవాన్ని వివరించారు. అనంతరం నిర్వాహకులు రామకృష్ణను సత్కరించారు. కార్యక్రమంలో డాక్టర్ శిరీషా రఘురామ్, డాక్టర్ హరిచందన్, సంస్కృత కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.జనార్దననాయుడు, సాహితీవేత్తలు కొట్టు బాబూరావు, సోమేశ్వరరావు, మురళీప్రసాద్, హరిప్రియ, ఆముక్తమాల్యద, హృషీకేశం, తదితరులు పాల్గొన్నారు.

ఏఎంసీ చైర్‌పర్సన్‌గా గాయత్రి

పూసపాటిరేగ: పూసపాటిరేగ వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గ ప్రమాణస్వీకారం ఆదివారం జరిగింది. మండలంలోని సీహెచ్ అగ్రహారం సమీపంలో గల లేఅవుట్‌లో చైర్‌పర్సన్‌గా గేదెల గాయత్రి , వైస్ చైర్‌పర్సన్‌గా బాసి దుర్గమ్మతో పాటు డైరెక్టర్లుగా దిండి నారాయణరావు, పిన్నింటి రామకృష్ణ, దీపిల్లి బంగారమ్మ, మొంగం మోహన్, కర్రి కుమారి, పతివాడ రామునాయుడు, చిల్లా లక్ష్మి, సిమ్మల చిరంజీవి, గుండపు దేవి, మోపాడ లక్ష్మి, కోరాడ రమేష్, గరే వెంకటరమణ, మద్దిల ముత్యాలునాయుడు ప్రమాణస్వీకారం చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే లోకం నాగమాధవి, మాజీ మంత్రి పతివాడ నారాయణస్వామినాయుడు, మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు, మార్కెటింగ్‌శాఖ ఏ.డి బి. రవికిరణ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శి సతీష్, ప్రజాప్రతినిధులు గేదెల రాజారావు, సువ్వాడ రవిశేఖర్, కడగల ఆనంద్‌కుమార్, కంది చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

వినియోగంలోకి వచ్చేదెప్పుడో..?

- 16వ నంబర్ జాతీయ రహదారిలో విశ్రాంతి భవనాలు
- 50 కిలోమీటర్లకొక రెస్ట్ ఏరియా
- భోగాపురం పరిధిలో ఏర్పాటు చేసిన హైవే అధికారులు
- నేటికీ వినియోగంలోకి రాని వైనం



వినియోగంలోని రాని విశ్రాంతి గృహాలు

భోగాపురం: జిల్లా పరిధిలోని 16వ నంబర్ జాతీయ రహదారిపై ప్రమాదాలను అరికట్టాలనే ఉద్దేశంతో జాతీయ రహదారుల అభివృద్ధి సంస్థ (ఎన్‌హెచ్‌ఏఐ) విశ్రాంతి గృహాలను (రెస్ట్ ఏరియాలు) ఏర్పాటు చేసింది. సువిశాలమైన పార్కింగ్ ప్రాంగణంలో వాహనాలకు పార్కింగ్ సౌకర్యం, డ్రైవర్లు, క్లీనర్లు విశ్రాంతి తీసుకునేందుకు పడకలు, వారికి అవసరమైన ఆహార పదార్థాలు అందించేందుకు క్యాంటీన్ సదుపాయాలను కూడా అధికారులు ఏర్పాటు చేశారు. ఒకేసారి వందకు పైగా వాహనాలను నిలుపుకునే వీలుంది. వీటి ఏర్పాటుతో ప్రమాదాల సంఖ్య గణనీయంగా తగ్గుముఖం పడుతుందని ప్రభుత్వం, ఎన్‌హెచ్‌ఏఐ, పోలీసులు అధికారులు భావించారు. అయితే ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు ఏర్పాటు చేసిన విశ్రాంతి గృహాలు (రెస్ట్ ఏరియా) వినియోగంలోకి రాకపోవడంతో దూర ప్రాంతాలు ప్రయాణం సాగించే డ్రైవర్లు అలసట చెంది ప్రమాదాల బారిన పడుతున్నారు. జిల్లాలోని భోగాపురం, పూసపాటిరేగ మండలాల్లో 16వ నంబర్ జాతీయ రహదారి విస్తరించి ఉంది. రాజాపులోవ నుంచి కందివలస గెడ్డ వరకు సుమారు 30 కిలోమీటర్ల పొడవునా ఈ రహదారి ఉంది. అటు కోల్‌కతా నుంచి ఇటు చెన్నై నుంచి ఈ జాతీయ రహదారిపై రోజుకు వేల సంఖ్యలో వాహనాల రాకపోకలు సాగిస్తుంటాయి. రోజుల తరబడి డ్రైవర్లు నిద్ర లేకుండా తమ వాహనాలను నడుపుతారు. అయితే జాతీయ రహదారి నుంచి పార్కింగ్ స్థలంలోకి వాహనాలు వెళ్లేందుకు ఇటు ప్రభుత్వం అటు హైవే అధికారులు కలిసి జాతీయ రహదారి



వాహనాలు నిలుపుకునేందుకు ఏర్పాటు చేసిన పార్కింగ్ స్థలం

నుంచి పార్కింగ్ స్థలం వరకు కనెక్టివ్ రోడ్డును ఏర్పాటు చేయాల్సి ఉంది. ఏళ్లు గడుస్తున్న ఇంతవరకు కూటమి ప్రభుత్వం ఆ పని చేయడం లేదు. దీంతో వాహనాలు నిలిపేందుకు సౌకర్యం లేకపోవడంతో రోడ్డుపైనే పార్క్ చేసి ఆ వాహనాల్లో డ్రైవర్లు, క్లీనర్లు నిద్రపోతున్నారు. ఆ సమయంలో అదే దారిలో ప్రయాణించే వాహనాలు పార్కింగ్ చేసే వాహనాలను ఢీకొన్న సంఘటనలు చాలా జరిగాయి. ఈ ప్రమాదాలను అరికట్టేందుకు 50 కిలోమీటర్లకు ఒకటి చొప్పున రెస్ట్ ఏరియాలను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. దీనిలో భాగంగా జిల్లా పరిధిలోని భోగాపురం జాతీయ రహదారి రోడ్డు పక్కన ఏర్పాటు చేసిన విశ్రాంతి గృహాలను వినియోగంలోకి తీసుకుని వచ్చినట్లయితే చాలావరకు రోడ్డు ప్రమాదాలు తగ్గుముఖం పడతాయని వాహనదారులు అంటున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వాటిని వినియోగంలోకి తీసుకువచ్చి రోడ్డు ప్రమాదాలు తగ్గుముఖం పట్టేలా చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం



భోగాపురం, పూసపాటిరేగ మండలాల పరిధిలోని 16వ నంబర్ జాతీయ రహదారుల్లో రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. ఈ ప్రమాదాలను నియంత్రించేందుకు ప్రభుత్వం, ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు ఇప్పటికే డ్రైవర్లు విశ్రాంతి తీసుకునేందుకు భోగాపురంలో రెస్ట్ ఏరియాను ఏర్పాటు చేశారు. అయితే రెస్ట్ ఏరియా వినియోగంలోకి రాకపోవడంతో ప్రమాదాలు ఎక్కువగా సంభవిస్తున్న మాట వాస్తవమే. ఈ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి విశ్రాంతిగృహాలను వియోగంలోకి తెచ్చే విధంగా చర్యలు చేపడతాం.

– కె దుర్గాప్రసాద్, భోగాపురం (అప్‌గ్రేడ్ పోలీస్‌స్టేషన్) సీఐ,

లోపాలకు తావివ్వకూడదు..

- కలెక్టర్ రామసుందర్ రెడ్డి

విజయనగరం అర్బన్: వచ్చే నెల 1న జిల్లాలోని దత్తి గ్రామంలో పింఛన్ల పంపిణీకి ముఖ్యమంత్రి చంద్రబాబు వస్తున్న నేపథ్యంలో అధికారులంతా వారికి కేటాయించిన విధులను శ్రద్ధతో నిర్వహించి, ఎటువంటి లోపాలు జరగకుండా చూడాలని కలెక్టర్ రామసుందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక కలెక్టరేట్‌లో జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పింఛన్ల పంపిణీ, పింఛనర్లతో ముఖాముఖి, ప్రజావేదిక, పార్టీ సమావేశం వంటి కార్యక్రమాలు ఉంటాయని.. ప్రజావేదిక వద్ద దత్తి గ్రామానికి చెందిన ప్రజలే హాజరవుతారని తెలిపారు. ముఖ్యమంత్రి నాలుగు గృహాల వద్దకు వెళ్లి నలుగురికి పింఛన్లు అందజేస్తారని, ఆ గృహాల వద్ద విద్యుత్ తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. మంచి కండీషన్‌లో ఉన్న అంబులెన్స్‌లను ఏర్పాటు చేయాలని సూచించారు. ముఖ్యమంత్రి పాల్గొనే ప్రతి చోటా హైస్పీడ్ ఇంటర్నెట్ ఏర్పాటు చేయాలని ఎస్‌బీసీ అధికారులను ఆదేశించారు. బందోబస్తు, సెక్యూరిటీ, రోప్ పార్టీ, పార్కింగ్, తదితర ఏర్పాట్లన్నీ పోలీస్ అధికారులు జాగ్రత్తగా చూసుకోవాలని తెలిపారు. సమావేశంలో సంయుక్త కలెక్టర్ సేతు మాధవన్, డీఆర్‌ఓ శ్రీనివాసమూర్తి, ఆర్డీఓలు, వేదికల ఇన్‌చార్జ్ అధికారులు, ముఖ్యమంత్రి పర్యటనలో డ్యూటీ వేసిన అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ ఎస్. రామ్‌సుందర్‌రెడ్డి

మీడియాను పిలిచి బెదిరించడం తగదు

నెల్లిమర్ల రూరల్: మీడియా సమావేశం పేరిట జర్నలిస్టులను పిలిచి బెదిరించడం ఎమ్మెల్యే లోకం నాగమాధవి భర్త లోకం ప్రసాద్‌కు తగదని వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి రేగాన శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. పత్రికల్లో, టీవీ చానళ్లలో వస్తున్న వార్తలు అవాస్తవమైతే నిరూపించుకోవాలి కాని మీడియాను దూషించడం తగదన్నారు. ఈ విధానం ప్రజాస్వామ్యానికి మంచిది కాదన్నారు.

పేదలకు మెరుగైన వైద్యసేవలు

- మిమ్స్ డీన్ లక్ష్మీకుమార్

నెల్లిమర్ల: పేద ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందుబాటులోకి తీసుకురావడానికి మిమ్స్ యాజమాన్యం బొబ్బిలి, రామతీర్థం, విజయనగరం, విజయనగరం రైల్వేస్టేషన్ ప్రాంతాలలో హెల్త్ సెంటర్లు ఏర్పాటు చేసిందని డీన్ లక్ష్మీకుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ హెల్త్ సెంటర్ల నిర్వహణ కోసం వైద్యులు, నర్సింగ్ స్టాఫ్, పారామెడికల్ స్టాఫ్‌ను నియమిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సంస్థలో సుమారుగా 700 మందికి పైగా పనిచేస్తున్నారని.. ఆస్పత్రి, హెల్త్ సెంటర్ల నిర్వహణ కోసం వైద్యులు, హెల్త్ ఆఫీసర్లు, ఇతర ఉద్యోగులను బదిలీ చేయడం నిరంతర ప్రక్రియ అని చెప్పారు. ఈ క్రమంలోనే మహిళ రోగులకు వైద్యసేవలందించే నిమిత్తం నైపుణ్యం గల ఆయాను బదిలీ చేసే క్రమంలో విజయనగరం హెల్త్ సెంటర్ నుంచి బొబ్బిలి హెల్త్ సెంటర్‌కి యడ్ల గౌరిని పంపించామని వెల్లడించారు. ఆమె ఈ బదిలీ ఉత్తర్వులు తీసుకోవడానికి నిరాకరించి బయట వ్యక్తుల ప్రోద్బలంతో బెదిరింపు చర్యల్లో భాగంగా పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిందని చెప్పారు. పేద రోగులకు మెరుగైన వైద్యసేవలందిస్తూ ఉద్యోగుల సంక్షేమమే ధ్యేయంగా ప్రశాంతంగా పనిచేస్తున్న మిమ్స్‌లో యాజమాన్యానికి సిబ్బంది మధ్య విభేదాలు సృష్టించడానికి బయట వ్యక్తులు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. కరోనా సమయంలో అప్పటి కలెక్టర్ ఉత్తర్వులు ధిక్కరించి ఉద్యోగులతో బలవంతంగా ధర్నాలు చేయించి వారి ఉద్యోగాలను పోవడానికి సీఐటీయూ నాయకుడు టీవీ రమణ కారకులయ్యారని గుర్తుచేశారు. అలాగే బి సూర్యనారాయణ అనే డ్రైవర్ మద్యానికి బానిసై అప్పుల బాధ తాళలేక ఆత్మహత్య చేసుకుంటే దాన్ని మిమ్స్ యాజమాన్యానికి ఆపాదించడం తగదన్నారు.

సేవా కార్యక్రమాలు మంచి సంప్రదాయం



కార్యక్రమంలో పాల్గొన్న రక్తదాతలు, నాయకులు

- నగర పంచాయతీ వైస్ చైర్మన్ రామారావు

నెల్లిమర్ల: జన్మదినోత్సవాలు, వర్ధంతి కార్యక్రమాల సందర్భంగా సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టడం గొప్ప సంప్రదాయమని నగర పంచాయతీ వైస్ చైర్మన్ సముద్రపు రామారావు అన్నారు. నగర పంచాయతీ పరిధిలోని జరజాపుపేట గ్రామానికి చెందిన మద్దిల రాము 10వ వర్ధంతిని పురస్కరించుకొని ఆయన సోదరుడు, గాంధీరామ్ ఎడ్యుకేషనల్ – వెల్ఫేర్ సొసైటీ వ్యవస్థాపకుడు మద్దిల సన్యాసిరావు ఆధ్వర్యంలో ఆదివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 38 మంది యువకులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో అవనాపు సత్యనారాయణ, నల్లి శ్రీను, మద్దిల వాసు, సాధన యువజన సంఘం అధ్యక్షుడు పోలుబోతు దుర్గాప్రసాదరావు, ప్రధాన కార్యదర్శి పసుమర్తి వెంకటరమణ, ఉపాధ్యక్షుడు బెల్లాన వెంకటరావు, సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం..

- డిజిటల్ బుక్ ఆవిష్కరణలో మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ

డెంకాడ: వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలకు అండగా ఉండాలన్న ఉద్దేశంతో వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి డిజిటల్ బుక్‌ను అందుబాటులోకి తీసుకువచ్చారని నెల్లిమర్ల మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. మండలంలోని పినతాడివాడలో సర్పంచ్ లెంక లక్ష్మణరావు ఇంటి వద్ద జరిగిన కార్యక్రమంలో డిజిటల్ బుక్‌ను మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, పార్టీ నాయకులు ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అధికారంలో ఉన్న కూటమి నేతలు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా ప్రజలను మోసం చేశారన్నారు. ఎన్నికల ముందు అనేక హామీలు ఇచ్చారని, వాటిని అమలు చేయకుండా చేశామని చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. కూటమి నేతల మోసాలను ప్రజలు గమనిస్తున్నారని తెలిపారు. కూటమి నేతలు ప్రతిపక్ష వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలను వేధిస్తున్నారని తెలిపారు. అధికార పార్టీ నేతలు అధికారుల అండదండలతో రెచ్చిపోతున్నారని విమర్శించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలను వేధించే వారి వివరాలు డిజిటల్ బుక్‌లో నమోదు చేస్తారన్నారు. అధికారులు, కూటమి నేతలు వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలను వేధించడమే లక్ష్యంగా పెట్టుకుంటే వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రాగానే తగిన గుణపాఠం తప్పదని హెచ్చరించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నాడు – నేడు కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేస్తే.. కూటమి ప్రభుత్వం విద్యారంగాన్ని భ్రష్టు పట్టించిందని ఆరోపించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ డెంకాడ, భోగాపురం, పూసపాటిరేగ మండలాల అధ్యక్షులు పిన్నింటి తమ్మునాయుడు, ఉప్పాడ సూర్యనారాయణ, పతివాడ అప్పలనాయుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు బడ్డుకొండ ప్రదీప్‌నాయుడు, పతివాడ సత్యనారాయణ, కోరాడ కోటి నాయుడు, మహంతి శ్రీనివాసరావు, కలిశెట్టి రామకృష్ణ, లెంక లక్ష్మణరావు, చంటి రాజు, సురేష్‌రెడ్డి, బడుకొండ రామునాయుడు, బుగత రమణ, బమ్మిడి వెంకటరమణ, పతివాడ కృష్ణవేణి, తదితరులు పాల్గొన్నారు.



డిజిటల్ బుక్ క్యూ ఆర్ కోడ్ ఆవిష్కరిస్తున్న బడ్డుకొండ, తదితరులు

భగత్‌సింగ్‌కు ఘన నివాళులు



భగత్‌సింగ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు, సభ్యులు

విజయనగరం గంటస్తంభం: భారత విప్లవోద్యమకారుడు, స్వాతంత్ర్య సమరయోధుడు సర్దార్ భగత్ సింగ్ 118వ జయంతి ఆదివారం స్థానిక అమర్‌భవన్‌లో ఘనంగా నిర్వహించారు. సీపీఐ నియోజవర్గ కార్యదర్శి బుగత అశోక్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ ముఖ్య అతిథిగా హాజరై భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఒమ్మి రమణ మాట్లాడుతూ.. భగత్‌సింగ్ చరిత్ర ఆద్యంతం చైతన్యపూరితమని.. నిరాశలో కూరుకుపోయిన వారు ఆయన జీవిత గాథ చదివితే చాలు ఉత్తేజితులవుతారని చెప్పారు. సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటంలో భగత్‌సింగ్ వెలిగించిన విప్లవ జ్యోతి ఈనాటికి స్ఫూర్తినిస్తోందన్నారు. కార్యదర్శి బుగత అశోక్ మాట్లాడుతూ.. భగత్‌సింగ్ బ్రిటీష్ వారిని ధైర్యంగా ఎదురించి, అతి చిన్న వయసులోనే ఉరి శిక్షను నవ్వుతూ స్వీకరించారని కొనియాడారు. కార్యక్రమంలో సీపీఐ నేతలు ఎ.జగన్నాథం, పి.అప్పలరాజు, ఎ.రాములు, ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి పి.గౌరీశంకర్, విశాలాంధ్ర బుక్‌హౌస్ మేనేజర్ సయ్యద్ ఇబ్రహీం, రాజు, తదితరులు పాల్గొన్నారు.

మండే అగ్ని గోళం..

విజయనగరం గంటస్తంభం: భగత్‌సింగ్ మండే అగ్ని గోళమని తెలుగు భాషా పరిరక్షణ సమితి అధ్యక్షుడు సముద్రాల గురుప్రసాద్, కార్యదర్శి జక్కు రామకృష్ణ అన్నారు. గురజాడ స్వగృహంలో తెలుగు భాషా పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో భగత్‌సింగ్ జయంతి నిర్వహించారు. కార్యక్రమంలో రెడ్డి శంకరరావు, కాగుపాటి నారాయణమూర్తి, కంది సత్యనారాయణమూర్తి, చంద్రశేఖర్, గురజాడ కుటుంబీకులు ఇందిర, వెంకటేశ్వర ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.



నెల్లిమర్ల: భగత్‌సింగ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీఐటీయూ నాయకులు

ఉద్యమించాలి..

నెల్లిమర్ల: భగత్‌సింగ్ స్ఫూర్తిగా కార్మికులు, కర్షకులు ఉద్యమించాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు కిల్లంపల్లి రామారావు పిలుపునిచ్చారు. జరజాపుపేట అమరవీరుల స్థూపం వద్ద భగత్‌సింగ్ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ.. బ్రిటీష్ దొరల పాలనకు వ్యతిరేకంగా పోరాడిన భగత్‌సింగ్ చిన్న వయసులోనే ఉరికంబం ఎక్కారన్నారు. నేటి యువత భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల స్వాతంత్ర్య పోరాటాన్ని ఆదర్శంగా తీసుకొని పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సుంకర సన్యాసిరావు, బొలే కృష్ణమూర్తి, కనకల సూర్యనారాయణ, మద్దిల ఆదినారాయణ, కిల్లంపల్లి రామకృష్ణ, పల్ల రాము, తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న భరతనాట్య ప్రదర్శన



కళాకారిణుల నృత్య ప్రదర్శన

విజయనగరం టౌన్: దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా స్థానిక బాబామెట్టలో గల వరలక్ష్మీ నాట్యాలయం విద్యార్థులు ద్వారకా తిరుమలలో ఆదివారం భరతనాట్య ప్రదర్శన ఇచ్చారు. వేంకటేశ్వరస్వామి దేవస్థానం వారి పిలుపు మేరకు కుంకుళ్లమ్మ దేవాలయంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాల్లో 'మహాచండీ అవతారం' అనే పాటకు నృత్యం చేశారు. నాట్యాలయం గురువు పేరి వరలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ప్రదర్శనలో సాయివెన్నెల, మనస్విని, మౌనిక, నిఖిత, లలిత, సాహిత్య, శివశ్యామశ్రీ, జాహ్నవి కృష్ణ, సిరిచందన, మాన్యవి, వినయశ్రీ, లోచన, లౌక్య, కుందన, యాశ్రిత నాట్యం చేసి భక్తులను అలరించారు.

స్మార్ట్ పోలీసింగ్‌తో మెరుగైన సేవలు

విజయనగరం క్రైమ్ : స్మార్ట్ పోలీసింగ్‌తో ప్రజలకు మెరుగైన సేవలు అందుతాయని ఎస్పీ ఏఆర్ దామోదర్ అన్నారు. నగరంలోని టూటౌన్ పోలీస్ స్టేషన్‌ను ఆదివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సీసీ కెమెరాల ఏర్పాటుపై సీఐ శ్రీనివాస్‌ను అడిగి తెలుసుకున్నారు. కమాండ్ కంట్రోల్ రూమ్‌లో ఉన్న దాదాపు 50 సీసీ కెమెరాలను పరిశీలించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సిబ్బందికి సూచించారు. ఆయన వెంట ఎస్సైలు కృష్ణమూర్తి, చంద్ర, కనకరాజు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

మహాచండీదేవిగా దుర్గాదేవి



మహాచండీదేవిగా దర్శనమిస్తున్న వనంగుడిలో కొలువైన దుర్గమ్మ



ప్రత్యేక అలంకరణలో జ్ఞాన సరస్వతీ అమ్మవారు



రాజరాజేశ్వరీదేవి అలంకరణలో కనకమహాలక్ష్మి

విజయనగరం టౌన్: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా స్థానిక రైల్వేస్టేషన్ వద్దనున్న పైడితల్లి అమ్మవారి వనంగుడిలో పూజలందుకుంటున్న దుర్గాదేవి ఆదివారం మహాచండీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ వేదపండితులు వెలువలపల్లి నరసింహమూర్తి, సాయికిరణ్, అర్చకులు నేతేటి ప్రశాంత్ శాస్త్రోక్తంగా పూజాదికాలును నిర్వహించారు. మహిళలు ప్రత్యేక అలంకరణలో ఉన్న దుర్గామాతకు కుంకుమార్చనలను చేశారు. కార్యక్రమాలను ఆలయ ఈఓ కె.శిరీష పర్యవేక్షించారు. అదేవిధంగా స్థానిక సిటీబస్టాండ్ వద్దనున్న కనక మహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో రాజరాజేశ్వరిదేవీగా అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. రింగ్‌రోడ్డు ఎస్‌వీఎన్ నగర్‌లో కొలువుదీరిన జ్ఞాన సరస్వతి అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు.

దీపారాధన..

భోగాపురం: మండలంలోని దల్లిపేట పంచాయతీ బొల్లింకలపాలెం ఆర్ఆర్ కాలనీలో దుర్గాదేవి శరన్నవరాత్రులు ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. అందులోభాగంగా కనకదుర్గమ్మ మంటపం వద్ద భవానీల ఆధ్వర్యంలో ఆదివారం సహస్ర దీపారాధన కార్యక్రమం అట్టహాసంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.



భోగాపురం: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా దీపారాధన